వైదిక సాహిత్యమాల-1 ఓమ్

పూజ
నిజస్వరూపము



హిందీమూలం : వీతరాగ స్వామి సర్వదానంద
అనువాదము : లోక లక్ష్మీనారాయణ బి.ఏ. బి.ఇడి.

—: ప్రకాశకులు :—
వైదిక సాహిత్యమాల
ఆర్యసమాజము గోషామహల్-భాగ్యనగరము. ఆం.ప్ర



శ్రీ లోకుల భర్తయ్య గుప్త

గారి

56 వ జన్మదినోత్సవ సందర్భమున

ప్రచురితము

కాళయుక్తి చైత్ర శు॥ ౨ ఆదివారము · 9–4–1978

శ్రీ లోకుల భర్తయ్య గుప్త గారి పరిచయం

జననము— రుధిరోద్గారి సంవత్సర చైత్ర శు॥ ౨ సోమవారం.

జన్మస్థలము—కన్కల్. తా॥ కామారెడ్డి, నిజామాబాదు జిల్లా.

సతీమణి— శ్రీమతి రంగమ్మగారు.

సంతానము— శ్రీ ఓం ప్రకాశ్, జయవ్రత్, లక్ష్మణ్, రమేశ్,
సురేంద్ర, మహేంద్ర మరియు కుమారి విజయలక్ష్మి.

వృత్తి— వ్యాపారము.

జీవిత విశేషములు:- వైశ్య శిరోమణి శ్రీ లోకుల భర్తయ్య గుప్తగారు వైదిక ధర్మానుయాయులు. మహర్షి దయానంద సరస్వతి, ఆర్యసమాజము పట్ల వారికి అమితమైన శ్రద్ధాభక్తులు గలవు. తమ గృహమందు ప్రతినిత్యము పంచ మహాయజ్ఞములను విధిగా ఆచరిస్తూ ఉంటారు. వేదోక్త సంస్కారములు తరచుగా జరిపిస్తూ ఉంటారు.

భర్తయ్యగారు క్రమశిక్షణాయుతమైన జీవనము గడుపువారు. అష్టాంగయోగపు ఆసన ప్రాణాయామాదులను నియమానుసారముగా అనుష్ఠిస్తారు. 56 సం॥ల ప్రాయమునగూడ వారు ఎంతో చురుకుగాను, ఉత్సాహంగాను కనుబడుటకు వారి యిట్టి నియమిత జీవితమే కారణము కాబోలు.

భర్తయ్యగారు తమ స్వయం కృషి మరియు నిజాయితీతో ఎంతో పైకి వచ్చారు. మొదట్లో వారు ఉస్మాన్ గంజ్ లోని శ్రీ కొత్తూరుసీతయ్య గుప్తగారి దుకాణంలో గుమస్తాగా పని చేశారు. తదుపరి వాటాదారులైనారు. ఇప్పుడు వారు స్వంత వ్యాపారాన్ని కొనసాగిస్తూ వృద్ధిచెందు

తున్నారు. భగవదనుగ్రహము వల్ల వారి సంపన్న కుటుంబము పుత్ర పౌత్రాదులతో వెలయుచున్నది.

క్రీ.శ. 1938 ప్రాంతమున శ్రీ కొత్తూరు సీతయ్యగుప్తగారి ప్రేరణ వల్ల భర్తయ్యగారు ఆర్యసమాజములో ప్రవేశించారు. శ్రీపండిత రాజారామ్ శాస్త్రి. పం॥ బుధదేవ శర్మ, వైద్య తుల్జారామ్ గార్లచే సంస్కృతము మరియు వైదిక సిద్ధాంతములను అభ్యసించారు. నాటి నుండి వారికి వైదిక సిద్ధాంతాల పట్ల తిరుగులేని నమ్మకము ఏర్పడింది. నేటికీవారు ఆ సిద్ధాంతములకు అనుగుణ్యమైన జీవితాన్ని గడుపుటకు ప్రయత్నిస్తూ ఉన్నారు.

భర్తయ్యగారి సహృదయత, ఔదార్యము, దానశీలత ప్రశంసనీయములు. గురుకులములకు, ఆర్యసమాజాలకు వారు తరచుగా ధన సహాయము చేస్తూ ఉంటారు. పూర్వము మహారాజ్‌గంజ్‌లో ఉన్న దయానంద ఉపదేశక విద్యాలయానికి కూడ వారు చాలా సహాయాన్ని అందజేశారు. ప్రస్తుతము గోషామహల్ ఆర్యసమాజానికి అధ్యక్షులుగా ఉన్నారు. గోషామహల్ ఆర్యసమాజ భవనాన్ని పునరుద్ధరించి దానిని ప్రస్తుత స్థితికి తీర్చి దిద్దుటయందు భర్తయ్యగారు సలిపిన కృషి అభినందనీయము. వైదిక ధర్మ ప్రచారము పట్ల వారు ఎంతో ఆసక్తిని కనబరుస్తారు. తెలుగు భాషలో వైదిక సాహిత్యము ప్రచురింపబడవలెనను వారికోరిక "వైదిక సాహిత్యమాల" ద్వారా నెరవేరుతున్నది. ఈ ప్రచురణ సంస్థకు వారు సంరక్షకులుగా ఉన్నారు.

శ్రీ లోకుల భర్తయ్యగుప్తగారి 56వ జన్మదిన సందర్భమున వారి ధన సహాయముతో ఈ పుస్తకము ప్రచురింపబడినది. వారికి మా కృతజ్ఞతలు, వారికి జన్మదిన శుభాకాంక్షలను అందజేస్తూ, భగవంతుడు వారికీ, వారి కుటుంబమునకు ఆయురారోగ్యైశ్వర్యములను ప్రసాదించుగాక యని కోరుచున్నాము,

—సంపాదకులు

మా మాట

మనమంతా శాంతి – సౌఖ్యము నభిలషించేవారము. వాటిని పొందుటకు సత్యజ్ఞానము, సాధన అవసరం. నేటి యుగమందు విద్య-విజ్ఞానము లెంతయో అభివృద్ధి గాంచినవి. వాని సహాయమున సుఖసాధనములను సమకూర్చుకొనవచ్చు. యేనకేన ప్రకారేణ వాటిని సమకూర్చుకొనుటే జీవితపరమావధియైపోయినది. అందుచేత సమాజంలో నీతి – బాహ్యమైన వ్యవహారము సాగుతూవుంది. శాంతి కరువై పోయినది. దీనికంతా కారణం—అజ్ఞానం - స్వార్థం.

వీటిని పారద్రోలుటకు సత్యజ్ఞానము-పరమార్థము నెరుగవలసిన ఆవశ్యకత ఎంతేని వుంది, ఈ సత్యము నెరగిన మహర్షి దయానందులు సత్యజ్ఞానమునకు నిలయమైన వేద-విజ్ఞానమును వెదజల్లుటకు కంకణం కట్టుకున్నారు. తదాశయసిద్ధికై ఆర్యసమాజమును స్థాపించారు. మహర్షి అనుయాయు లెందరో చిత్తశుద్ధితో వేదప్రచారము కోసం దేశసేవకోసం అంకితమై పోయారు. కాని ప్రస్తుత పరిస్థితి వేరు. వేద ప్రచారము సన్నగిల్లుతూవుంది. అనుదినమూ విద్వాంసులు, ప్రచారకులు కరువై పోతున్నారు. సాహిత్య సృజన అంతకంటే కొరవడుతూ వుంది. ఇట్టి విషమపరిస్థితిని తిలకిస్తూ అభిమానము గల ఆర్యులు నిట్టూర్పు విడుస్తున్నారు. ప్రయోజనం?

అందుచే ఇట్టి తరుణంలో మనమంతా నిరాశా నిస్పృహలతో నిట్టూర్పు విడిచేకన్నా కర్తవ్యోన్ముఖుల మగుట ఎంతేని అవసరం. ఎవరేమిచేయుచున్నారు అని విమర్శించేముందు నేనేమిచేయుచున్నాను? అని ప్రశ్నించుకుంటే బాగుంటుంది. చేతనైన నిర్మాణాత్మకమైన కృషి

సలిపితే ప్రయోజనకారిగా వుంటుంది.

"వైదిక సాహిత్యమాల":– పై అభిప్రాయముతో జనసామాన్య మందు ధర్మప్రచారార్థము తగు సాహిత్యమునందివ్వాలని తలపెట్టినాము. "వైదిక సాహిత్యమాల"యను శీర్షికన ఇట్టి సాహిత్యమును ప్రచురించ దలిచాము. ఇందు వేదోక్త, వేదసమ్మత అభిప్రాయములను వెలిబుచ్చు మూల రచనలు, అనువాదములు లఘుపుస్తకముల రూపమున ప్రచురిస్తాము.

ఇంతవరకు "మీ హితము ఇందే నిహితమైయున్నది", "ఆరాధ్యు దెవరు?" మరియు "ఆర్యసమాజము" అను మూడు ప్రచురణలను మీకు అందించ గలిగాము. ఈ పవిత్ర కార్యము కొనసాగుటకు ధర్మాభిమానులంతా తగు సహకారము నందివ్వాలని ప్రార్థించుచున్నాము. రూ॥ 101/– చెల్లించి ధర్మ రక్షక సభ్యులుగాను. రూ॥ 51/– చెల్లించి ధర్మ పోషక సభ్యులుగాను, రూ॥ 25/– చెల్లించి ధర్మ సహాయక సభ్యులుగాను. రూ॥ 11/– చెల్లించి ధర్మ మిత్ర సభ్యులుగాను చేరవలసిందిగా ఆహ్వానించుచున్నాము. ఒక్కొక్క ప్రచురణ భారమంతా ఒకే వ్యక్తి లేదా సంస్థ భరించినట్లయితే, ఆ ప్రచురణ యందు వారి సంపూర్ణ పరిచయము ఇవ్వబడును.

"వైదిక సాహిత్యమాల" సురభిత కుసుమముల నాఘ్రాణింప జేయుటకు మా యీ ప్రణాళిక మీ కందరికి నచ్చుతుందనే విశ్వాసంతో మీ సహాయ సహకారములు తప్పకుండా లభించగలవనే ఆశతో—

భవదీయులు

లోకుల భర్తయ్య గుప్త
సంరక్షకులు

ప్రేమరాజ్ "ప్రేమ్"
ఆర్. రామచంద్రకుమార్
సంపాదకులు

సంపాదకీయం

పూజల ద్వారా పాప పరిహారము, పుణ్యప్రాప్తి కలుగుతుందనే నమ్మకం ఆస్తికుల్లో అనేకులకు ఉంది. కాని పూజయొక్క నిజ స్వరూపము తెలియకుండుటచే వారు అనేక బాహ్య ఆడంబరాలతో జరుగు ప్రక్రియలనే పూజ అనుకుంటున్నారు. పూజ లాచరించుటకు పలుతీర్థ స్థానములనూ, గుళ్ళనూ. గోపురాలనూ సందర్శిస్తూ తమ అమూల్య సమయాన్నీ, ధనాన్నీ, శక్తినీ వ్యయపరచి తరించి పోయా మనుకుంటారు. కాని తర్వాత అనేక ఇబ్బందులకు గురి ఔతారు. దీనికంతా అజ్ఞానమే కారణమని వేరుగా చెప్పనవసరం లేదు. వేదజ్ఞానము, ఆర్ష-విద్యాప్రచారము లేకపోవుటచే ఇట్టి అజ్ఞానము ప్రబలిందని మహర్షి స్వామి దయానందులవారు అభిప్రాయ పడ్డారు.

నేడు ఆధ్యాత్మిక రంగము ఎంతో విచిత్రంగా మారిపోయింది, అరచేతిలో స్వర్గం చూపించే భగవాను లెందరో అనుదినమూ అవతరిస్తున్నారు. భగవంతునిచే రుటకు Short-cut మార్గాన్ని మేము చూపిస్తామంటే మేము చూపిస్తామని పోటీపడుతున్నారు. ఎవరు సరియైన మార్గాన్ని చూపిస్తారు? ఎవరిని అనుసరించాలి? అని అమాయకులు తికమక పడుతున్నారు. అనేకులు నాస్తిక్యము వైపునకు పరుగులెత్తుచున్నారు. పాశ్చాత్య-"ఇజముల" ప్రభావానికి గురియైన కొందరు ఆస్తిక్యాన్ని సమూలంగా రూపు మాపుటకు సంసిద్ధులై ఉన్నారు. ప్రణాళికాబద్ధమైన ప్రయత్నాలు కొనసాగిస్తూ ఉన్నారు.

ఆస్తికులనబడేవారు ఈసవాల్‌ను ఎదుర్కోవలసి ఉంది. అందుకై ఆధ్యాత్మిక రంగానికి సంబంధించిన వివిధ అంశాల్ని క్షుణ్ణంగా తెలుసు

కోవలసిన అవసరం ఎంతేని ఉంది. వ్యక్తి జీవితంలో ఆధ్యాత్మికత ప్రయోజనాన్ని ఆచరణ ద్వారా ఋజువు చేయాలి. అందుకై అసత్యాన్ని విడనాడి సత్యాచరణకు పూనుకోవాలి. సత్యసనాతనమైన వైదిక ధర్మమే మనకు ఋజు మార్గాన్ని చూపుతుంది. "నాఽన్యః పంథా విద్యతేఽయనాయ" ఇంకో మార్గము లేనే లేదు.

మహర్షి దయానంద సరస్వతి విరచిత "సత్యార్థ ప్రకాశము" వైదిక ధర్మ మహాత్మ్యమును విపులముగా వివరించు ఉద్గ్రంథము. నేటి యుగమందు జరుగుతూవున్న బూటకాల్ని నాస్తిక్యాన్ని నిర్మూలించుటకు రామబాణము ఆ గ్రంధము. అందుచే ప్రతి ఒక్కరూ దానిని చదివి తీరాలి.

మహర్షి దయానంద సరస్వతి అనుయాయులు వీతరాగస్వామి సర్వదానందులవారు 'పూజ' యను ఆధ్యాత్మిక అంశాన్ని గూర్చి వివరిస్తూ सच्ची पूजा అను తమ లఘు పుస్తక మందు పూజయొక్క నిజ స్వరూపాన్ని తేట తెల్లము చేసినారు. శ్రీ లోక లక్ష్మీనారాయణగారి తెలుగు అనువాదముతో స్వాముల వారి అమూల్య రచనను తెలుగు పాఠకలోకానికి అందిస్తూ మేమెంతయో సంతసించుచున్నాము. ఈ పుస్తకము పూజ ననుష్ఠించు సరియైన మార్గమును చూపి, సాధకులకు సుఖసంతోషములను ప్రసాదిస్తుందనే నమ్మకం మాకుంది.

చిత్రకారుడు నరేంద్రరాయ్ ముఖ చిత్రాన్ని అందంగా చిత్రించి ఇచ్చారు. వారికి మా కృతజ్ఞతలు.

కాళయుక్తి చైత్ర శు॥ల

ది. 9-4-1978.

—సంపాదకులు

ఓ౩మ్

పూజ నిజస్వరూపం

ఏకో వశీ సర్వభూతాంతరాత్మా
ఏకం రూపం బహుధా యః కరోతి।
తామాత్మస్థం యేఽను పశ్యన్తి ధీరాః
తేషాం సుఖం శాశ్వతం నేతరేషామ్॥ కఠోపనిషత్తు

ఈ మంత్రమున— ౧. పరమేశ్వరుని ఉనికి నిశ్చితము, ౨. అతనిని పొందిన మానవులకు అతనియందు విశ్వాసము పెంపొందును, ౩. ఈశ్వరుని కీర్తియొక్క వర్ణన; ౪. అతనిని పొందినవాడు మహిమగలవాడగును—అనెడి నాల్గు విషయాలు తెలుపబడినవి.

ఇతర జాతులవారు ఆర్యులకు పరమేశ్వరుని జ్ఞానము సృష్టి ఉత్పత్తియైన చాలా కాలానికి గాని కలుగలేదని అంటారు. కాని మీరు వేదాలను, ఉపనిషత్తులను చదువండి. ఉపనిషత్తులలో "ఏకోవశీ." పరమేశ్వరు డొకడే అని తెలుపబడినది. వేదములోని "సనోబంధుర్జనితా" అతడు మనకు బంధువు, మనకు జన్మ నిచ్చువాడు అను ఏకవచన ప్రయోగము ఈశ్వరుడొకడే, అనేకులు లేరు-అని సూచించుచున్నది. అథర్వవేదమున—

నద్వితీయో న తృతీయశ్చతుర్థో నా ప్యుచ్యతే॥
న పంచమో న షష్ఠః సప్తమో నా ప్యుచ్యతే॥
నాష్టమో న నవమో దశమో నా ప్యుచ్యతే।
య ఏతం దేవమేకవృతం వేద॥ అథర్వ. ౧౩-౪-౧౬॥

అతడొకడే అని మూడుసార్లు చెప్పబడినది. అతడు కేవలము

ఒకడే ఇద్దరు, ముగ్గురు, నల్గురు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది మంది కారు అని చెప్పినప్పటికి పరమేశ్వరుని జ్ఞానము ఆర్యులకు లేకుండెను అనుట ఎంతటి ధూర్తతయో మీరే యోచింపుడు-గొప్పవారి మాటలే చెల్లును. చిన్నవారివి ఎంత మంచి మాటలైనను లోకులు వినరు గదా! చిన్న వారెందరో మంచి విషయాలే చెప్పినను మనకు ఎవరిపై ఆదరభావము ఉండునో వారి మాటలనే విందుము. ఉదాహరణకు - ఒక నగరములో ఒక ధనికుడు రాచపుండుతో బాధపడుచుండెను. అతని వాడలోనే దానికి చికిత్స చేయు సివిల్‌సర్జను, మంగలి యుండిరి. మంగలి వానితో చికిత్స తక్కువ ఖర్చుతో కూడినది. కాని సివిల్ సర్జను చేయు చికిత్స 2, 3 వందలకు తక్కువగాదు. ఇద్దరు పుండును నయము చేయుదురు. కాని సివిల్ సర్జనుకు ఆదరమును, మంగలికి అనాదరమును ఎందులకు? దీనికి కారణము మంగలి చిన్నవాడు, సివిల్‌సర్జన్ చదువు కున్నవాడు, గొప్పవాడు అనియే కదా! చదువుకున్న వారికి ఆదరము ఉండునుగదా! వేదాలలో. ఉపనిషత్తులలో పరమేశ్వరుని కెన్నియో పేర్లు గలవు- అగ్ని, జలము, పృథివి, వాయువు, సూర్యుడు, చంద్రుడు మొదలగునవి అన్నియు పరమేశ్వరుని పేర్లే. ఇవి అతని గుణములను బట్టి ఏర్పడినవి. ఈ విషయము తెలిసికొనక హిందువులు సూర్యచంద్రా దులకు మ్రొక్కసాగిరి. కాని పరమేశ్వరుడు మాత్రము ఒకడే. అతడు అనంత నామములతో పిలువబడును. ఉపనిషత్తులో ఒకచోట జలము ఈ ప్రపంచమును సృష్టించిన దని కలదు. ఇచట జలము అనగా నీరు అను కొనుట సరిగాదు. దేనినుండి ఈ ప్రపంచము ఉత్పన్నమై దేనియందు లయమగుచున్నదో దానినే "జలము" అందురని శ్రీ శంకరాచార్యులు భాష్యమొనర్చిరి. ప్రపంచము ఉత్పన్నమైనప్పటి నుండి ఆర్యులకు

ఈ విషయము తెలియును.

వేదములోగల అగ్ని, జలము మున్నగు శబ్దములు ఈశ్వరుని నామములేయని నిర్ణయించుటెట్లు? వేదములో "అగ్నే! నయసుపథారాయే"- ప్రకాశ స్వరూపుడవైన ఓ అగ్నే! నన్ను మంచి మార్గమున నడుపుము అని కలదు. ఆలోచించుడు. ఇచట 'అగ్ని' యన 'నిప్పు' అనుకొన్నచో అది మనను మంచి దారిలో నడిపించగల్గునా? ఏమాత్రము అజాగ్రత్తగా నున్న మన శరీరమును, ధనాది వస్తువులను కాల్చి బూడిదచేయు నిప్పు మనను మంచి దారిలో నడిపింపగలదా? లోతైన నదిలో దూకిచూడుడు అది మిమ్ము ముంచివేయును. అట్టి జలము పరమేశ్వరుడెట్లగును? కావుననే ఉపనిషత్తులు మాటిమాటికి ఈశ్వరుడొకడే అనియు ఋషులు అతనిని ఎన్నియో పేర్లతో పిలిచిరని ఉద్ఘోషించుచున్నవి.

దీని మహిమ :

అంకెలు ఒకటితో మొదలగును, ప్రతి అంకెలోను సదా 'ఒకటి ఇమిడియే యుండును. ౨, ౩, ౪, ౫, ౬,......... అన్నింటిలో 'ఒకటి' ఉన్నది. అందుకే "నద్వితీయో" మొదలగునవి పేర్కొనబడినవి. దిగువ స్తుతి వాక్యములు గూడ ఈశ్వరస్వరూపమును తెలుపుచున్నవి.

"ఓ పరమేశ్వరా! నీకు పై భాగము గాని, మధ్యభాగముగాని, క్రింది భాగముగాని లేదు. నీవు విభాగరహితుడవు".

"ఓ ఈశ్వరా నిన్ను నే నెట్లు పొగడుదును? నీవు ఆది, మధ్య, అంతములు లేనివాడవు." సృష్ట్యారంభము నుండియే ఆర్యులు పరమే

శ్వరుని తెలిసికొని యుండిరి. మహాభారతకాలము తర్వాతనే విభిన్న సంప్రదాయములు ప్రబలి వీరి జ్ఞానమందు దోషమేర్పడినది. మహాభారత కాలమునకు పూర్వము ఎట్టి భేదమును కనబడదు. భిన్నాలేకాని, మల్లో త్రాలే గాని ఇట్టివే ఇతర ఉపజాతులేవియు లేకుండెను. ప్రాచీనకాలమున ౧. బ్రహ్మచారులు ౨. గృహస్థులు ౩. వానప్రస్థులు ౪. సన్న్యాసులు. అను నాలుగే విభాగము లుండెను. సంప్రదాయములు ప్రబలి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రి జాతులు ఏర్పడినవి. ఈ జాతి భేదములు మొదట లేకుండెను. వీనికి మూలము సంప్రదాయములే. ఆర్యసమాజ మొకటే ఇట్లు తలంచుచున్న దనుకొనకుడు 400 సంవత్సరములకు పూర్వము వాడైన తులసీదాసు గూడా ఇట్లే నుడివెను. ఈ విషయమున జనులాతని నడుగగా, ఒక ప్రశ్నకు నాలుగైదు సమాధానము లుండునా? అని ఎదురు ప్రశ్నించెను.

అందుకే సత్పదార్థము జాడతెలియకున్నదని అతడు నుడివెను. భారీ వర్షములు కురిసి నలువైపుల గడ్డి పెరిగి మార్గమును కప్పివేయగా బాటసారులు దారి తప్పిపోవుదురు. ఇదే విధముగ సత్సాహిత్యముద్వారా సత్పురుషులు మనకు చూపిన మార్గము మరుగునపడి పోగా పాషండులు స్వార్థముతోకూడిన సాహిత్యమును రచించి మనలను మార్గభ్రష్టుల నొన ర్చినారు. ప్రాచీన కాలమున జనులు పరమేశ్వరుని వాస్తవ స్వరూపమును కనుగొన గల్గినట్లే మీరుగూడా ఇపుడు తెలిసికొన గలుగుదురు. పరమేశ్వ రుడు మిక్కిలి సమీపమున నుండి మీ మాటను వినును. మీరతనికి సమీ పము కండు, అతని నుపాసించుడు. అతని నెట్టివానిగా గుర్తింతురో, విశ్వసింతురో మీరు స్వయముగ అట్లే యగుటకు యత్నించుడు. అట్లైనచో

మీరు అతనికి ఇంకా దగ్గరగుదురు. అతనిని సత్యస్వరూపుడని నమ్మి మీ జీవితమును సత్యమయ మొనర్చుకొనినచో అతనిని పొందుటలో ఆలస్య మేమియు జరుగదని తెలిసికొనుడు. అట్లుగాక దుకాణములో కూర్చొని గ్రాహకులకు తక్కువ తూచి యిచ్చి,అసత్యమాడ సాగినచో పరమేశ్వరుడు మీనుండి దూరమగును. మీ మనసులో నున్నది నాకును, నామనసులో నున్నది మీకును తెలియదు కాని ఈశ్వరుడు సర్వజ్ఞుడు, కావున అతనికి సర్వము తెలియును.

ఇతర మనుష్యుల ముందు ఒక చెడు పని చేయుటకు మనము భయపడుదుము, కాని మన మంచి, చెడు కర్మలనన్నిటిని సదా చూచు చుండునట్టి సర్వజ్ఞుడైన ఆ పరమేశ్వరునకు భయపడము. రెండు కళ్ళు గల మానవుడు ముందుకు మాత్రమే చూడగల్గును. తన వీపునుగూడ చూడజాలడు. కాని ఈశ్వరుడు సహస్రాక్షుడు. అతని దివ్యదృష్టినుండి ఎవరును తప్పుకొన జాలరు. మనము భయపడవలసినది అతనికేగాని మనుజులకు గాదు. చెడు కర్మలొనర్చిన ఫలము తప్పక లభించును. భారతవాసులు విపరీత కర్మ లొనర్చిరి. వాని ఫలమును ఇపుడు పొందు చున్నారు. వారి విపరీత కర్మలను చూచిన దెవరు? ఆ కర్మలకు ఫలము నిచ్చుచున్న దెవరు? ఇతరుల ఇంటికి పోయినపుడు మన స్వేచ్ఛహరించును. కాని మనము మన యింటిలోనే-మన దేశముననే పరతంత్రుల మైతిమి,ఇదంతయు చెడుకర్మల ఫలమే.ఇదంతయు ఈశ్వరుని న్యాయము వల్లనే జరిగినది.

మనము దీపము ముందు కూర్చొని చదువుచు నిదురింతు మనుకొనుడు. అపుడు దీపము మనను మేల్కొలుపునా? దాని పని వెలుగు నిచ్చుటయే కాని మేల్కొలుపుట కాదు. అట్లే జ్ఞాన ప్రకాశ మొసగుటయే

ఈశ్వరుని పని. మనుజుడు చెడు పని చేసినపుడు అతని ఆత్మ అతనిని దూషించును, హెచ్చరించును. కాని మనస్సుమాత్రము దుష్కర్మలందు తగుల్కొనును.

సేవకుని యింటికి యజమాని వెళ్ళినచో సేవకుని అమంగళము లన్నియు తొలగిపోవునందురు. సాహుకారు గుమాస్తాయింటికి, థానేదారు సిపాయి యింటికి, యజమాని సేవకుని యింటికి వెళ్ళినచో గుమాస్తా. సిపాయి మరియు సేవకుని ఆనందమునకు మేరయుండదు. ఈశ్వరుడు అందరికి స్వామి. మనమంతా అతని సేవకులము. స్వామియైన ఈశ్వరుడు సేవకులమైన మన యింటికి వచ్చినచో అమంగళము లన్నియు దూరమై అంతట ఆనందమే వెల్లి విరియును. కావున సోదరులారా! ఆ పరమేశ్వరుని ధ్యానించుడు. చెడు కర్మలను విడనాడుడు.

బాగుపడదలచినచో బలశాలురు కండు, బలమునకు కేంద్రము పరమేశ్వరుడే. అతని నుండియే బలము లభించును. మరొక చోటినుండి లభింపదు. విద్యుత్ కేంద్రము (Power house) నుండి సంబంధము తెగినచో అంతట చీకటి వ్యాపించును. అట్లే మన శరీరరూప గృహమందు ఆత్మరూప దీపము వెలుగుచున్నది. దాని శక్తికి కేంద్రము పరమేశ్వరుడు. కావున అతని నుండి మనకు సంబంధము తెగిపోవునట్టి కర్మలనుండి దూరముగ నుండవలెను. సంబంధము తెగిపోయినచో అంధకారమునబడి కొట్టు మిట్టాడుదుము.

పరమేశ్వరుడు అజన్ముడు. అతనికి పుట్టుకలేదు. ఈ విశ్వమును ఉత్పన్నమొనర్చి, పోషించి, లయ మొనర్చువానికి జన్మ మరణము లెట్లుండును? మనము పొరపాటు చేసి నష్టము పొందుదుము. మన పొర

పాటు వలన మనము నిజమైన వజ్రమును పొందనిచో వందల రూపాయల నష్టము కలుగును. పొరపాటు యొక్క ఫలితములో భేదముండదు. పరమేశ్వరుడు పరిపూర్ణుడు. అతడు పొరపాటు చేయడు, అతడే పొరపాటు చేసినచో కార్యములన్నియు చెడిపోవును.

హైదరాబాదు ప్రాంతమున వరకట్న దురాచారము వలన ఎందరో యువతులు అవివాహితులుగా నుండిపోవుచున్నారు. ఏలన వారి తలిదండ్రులు వరకట్నము చెల్లించలేని స్థితిలో నున్నారు. దీనిని చూచుచును జనులు ఈ దురాచారమును రూపుమాప యత్నింపకున్నారు. హైదరాబాదులో ఒక గొప్ప ఆంగ్లవిద్వాంసుని కూతురు మహమ్మదీయుని వివాహమాడి అతని మతమును స్వీకరించెను. అట్లెందుకు చేసితివని యడుగగా ఆమె "నా తండ్రి సౌకర్యముకొరకే ఇట్లు చేసితిని. ఏలన ఆతని వద్ద నాకు కట్నమిచ్చునంత ధనము లేనందువల్ల అతడు నా వివాహము చేయజాలక దుఃఖితుడుగ నుండెను. నేను మహమ్మదీయ మతమును స్వీకరించి కట్నమివ్వకుండగనే మహమ్మదీయుని వివాహమాడగలిగితిని." అనెను. చదువుకున్నవారెందరో గలరు. కాని వారు ఈ దురాచారమును రూపుమాపుటకు సమర్థులు కాకున్నారు. ఇది వారి పొరపాటు. ఎవరైనా జాతినుండి విడిపోయిన మరల తమ జాతిలో చేర్చుకొన యత్నింపరు. ఒక విద్వాంసు డెంత చక్కగా చెప్పినాడు.

"శాస్త్రాణ్యధీత్యాపి భవంతి మూర్ఖాః"

కొందరు శాస్త్రములను చదివినప్పటికిని మూర్ఖులుగనే యుందురు. వారు జ్ఞానము ననుసరించి కర్మచేయనివారు— అక్రియులు.

మరొక విద్వాంసుడు ఇట్లనెను—

"యస్తుక్రియావాన్ పురుషః స విద్వాన్"

"ఎవని జ్ఞాన, కర్మల రెంటి యందు ఏకత్వముండునో అతదే విద్వాంసుడు."

ఒకరోగి పడక క్రింద ఔషధము ఉంచిన, మందు ఎంత మంచి దైనప్పటికి రోగము తగ్గునా? మందు దగ్గరలో ఉన్నంత మాత్రమున రోగము తగ్గదు. ఔషధము కడుపులో ప్రవేశించిననే రోగము తగ్గుటకు వీలుండును. అట్లే శాస్త్రములను చదివినంత మాత్రమున మనకు కల్యాణము చేకూరదు. శాస్త్ర బోధలను ఆచరించిననే ఫలము లభించును జ్ఞాన, కర్మల రెంటియందును సమత్వము లేకున్నచో సుఖమెట్లు చేకూరును?

విద్య మరియు ఆత్మబలము ఈ రెండిటి పనులు భిన్నములైనవి. ఎట్లన పోలీసువాడు నేరస్థుని పట్టుకొనునే గాని దండన విధింపలేడు. అది న్యాయాలయము చేయవలసిన పని. న్యాయాధీశుడు తానే నేరస్థుని పట్టుకొని దండన విధింపడు. అట్లే యథార్థ జ్ఞాన మొసగుటే విద్య యొక్క పని. ఆ జ్ఞానమునకు క్రియాత్మక రూపమొసగుట ఆత్మబలముపై ఆధారపడియున్నది.

నేటి వైశ్యులు పిరికివారు. బొంబాయిలోని దుకాణములందు "సోదరులారా! ధైర్యము చాలామంచిది" అని వ్రాసియుండుట గాంచితిని. ఒక నాడచట పోట్లాట జరుగుచున్నట్లు సమాచారము వ్యాపింప వైశ్యులు తమ దుకాణములను మూసి పైకి వెళ్ళిపోయిరి. మనదేశవాసుల స్థితి ఇట్లున్నది! ఒకనాడు ఒక వైశ్యుని ఇంట దొంగ ప్రవేశించెను. వైశ్యుడు లేచి దీపము వెలిగించెను. దీపము ప్రకాశము

నొసగి దొంగను గుర్తించుటలో తన పనిని నెరవేర్చెను. దొంగను పట్టుట దాని పని కాదు, ఆ పని వైశ్యుని ఆత్మబలముపై ఆధారపడి యున్నది. అతడు సాహసియైనచో దొంగను పట్టుకొని బంధించును. అట్లుగాక భయపడి దుప్పటి కప్పుకొని పడుకొన్నచో దొంగ అతనిని పిరికివాడని తెలిసికొని నిర్భయముగ చేతికందిన వస్తువుల నన్నింటిని గొనిపోవును.

ఆత్మబలము, నిర్భయము రెండును ఈశ్వరోపాసన వలన లభించును కాని మనము ఈశ్వరుని మరచిపోయి మూర్తిపూజ చేయ నారంభించితిమి. చరిత్ర పుటలను త్రిప్పి చూడుడు. మహమూద్ గజనవీకి సహాయపడువాడు మనదేశమున ఎవడును లేకుండెను. మన దేశమునకు పచ్చు మార్గముగూడ అతనికి తెలియకుండెను. భారతీయు లందు ఆత్మబలము లేకుండెను. కావున సోమనాథమందిరముపై ఆత్మ బలముగల మహమూద్ గజనవీ ఆక్రమణ మొనర్చెను.

పూజారి ఆజ్ఞాపించినచో ప్రాణములొడ్డియైనను మూర్తిని రక్షిం చుటకు యాభై వేల యువకులు సంసిద్ధులై యుండిరి. కాని పూజారి మాత్రము "మనమేమి చేయవలసిన పనిలేదు. ఈశ్వరుడు తానే అన్ని టిని చక్కబెట్టును. ఇపుడే నలువైపుల అగ్ని రగుల్కొనును. ఆకాశము నుండి రాళ్ళ వర్షము కురియును. ఆక్రమణదారులు సర్వనాశనమగుదురు" అని అనెను. అటు మహమూద్ తన సైనికులతో ఇట్లనుచుండెను:—

"వీరులారా! మన సంఖ్య ౭, ౮ వందలు మాత్రమే. ఐనను ఈశ్వరుని నమ్మి సాహసముతో ముందడుగువేయుడు. ఈశ్వరుని కన్న పూజింపదగినవాడు మరొకడు లేడు. ప్రపంచమంతటను తన జ్యోతిని ప్రకాశింపజేయుమని అతని ఆజ్ఞ. పిరికివారు కావలదు." ఈ మాటలు

విని ఉత్సాహపూరితులైన ఆవీరులు "మేము ప్రాణాలు పోయినను వెనుదీయము" అని ఘోషించిరి.

ఇప్పుడచట మందిరపు శిథిలములు, మూర్తి యొక్క పూర్వవైభవ చిహ్నములు మిగిలినవి. అప్పుడా మందిరమున ౩౫౦ మంది పూజారులుండిరి. వారందరు సాహసించినచో మహమూదు విజయము పొందుట సంభవమే కాకుండెడిది.

ఇదంతయు ఈశ్వరుని విశ్వసింపనందువలననే జరిగినది. ఈశ్వరుని విశ్వసింతుమని మీరనవచ్చును. మీరు విశ్వసించు రూపమేది? ఈశ్వరపూజకు ధనమేమియు అవసరములేదు. ఈశ్వరపూజవల్ల మన సంపత్తి తరుగదు. మహాదేవుని మందిరమునకువెళ్ళి జలాభిషేకము మాత్రమేచేసి మూర్తియందు సాష్టాంగపడి నైవేద్య మేమియు సమిర్పించకున్న రెండు మూడు మారులు చూచి పూజారి నైవేద్యమేమియు తేలేదా? యని మిమ్మడుగును. ఠాకూరు మందిరమున కేగిన నైవేద్యమేమైన వెంటగొనిపోవలసి యుండును. కాని నిజమైన ఈశ్వరునిపూజకు బాహ్యవస్తువు ఏదియు అవసరముండదు కేవలము సమదృష్టియే అవసరమగును.

పరమేశ్వరుని కలిసికొనుటకు సమతా సిద్ధాంతముల నలవరచుకొనవలెను పగలెల్ల పనులయందు మునిగియున్నందున మానసిక సామ్యస్థితి యేర్పడదు. సాయంకాలము అలసటవల్ల సామ్యస్థితి యుండజాలదు. ప్రాతఃకాలమున మాత్రమే రాత్రి నిద్రవలన మన శరీర, మనస్సులు రెండును తేలికయై యుండును. అప్పుడు కాలకృత్యముల తీర్చుకొని శుద్ధమైన చన్నీటితో స్నానము చేయవలెను. అప్పుడు మన మనస్సును ఏకాగ్రము చేయ గల్గుదుము. ఇదియే ఈశ్వర చింతనకు తగిన సమయము నిద్రనుండి లేచిన బాలుడు తల్లి అతనిని ఒడిలోనికి తీసు

కొటబి తోడనే ఊరకొనును. తల్లి యొడిలో అతనికి అంతులేని శక్తి లంచును. అదే విధముగ పరమేశ్వరుని యొడిలోనికి చేరుకొనగనే మనోక్షోభములు, క్లేశములు అన్నియు సమాప్తమై పోవును. అలసటయే కాని బద్ధకమే ఉండదు. మనస్సును స్థిరము ఏకాగ్రము చేయుటకు అత్యుత్తమమైన సమయమిదియే.

రాత్రి నిద్రపోయినప్పుడు ధనికుడేమి, బీదవాడేమి–ప్రతి వాని స్థితి ఒకేతీరుగ నుండును. ఇది ఎవరి మహిమవల్ల జరుగుచున్నది ? ఏ డాక్టరు వీరందరికి క్లోరోఫామ్ వాసన చూపి మూర్ఛితులను చేసెను ? డాక్టరు వాసన చూపిన క్లోరోఫామ్ మత్తు, తెలివి వచ్చిన పిదప గూడ మిగిలియుండును. కాని ఈశ్వరుని క్లోరోఫామ్ అట్టిది కాదు. నిద్ర నుండి మేల్కొనిన పిదప పూర్వముకన్న ఆరోగ్యముగను, చురుకుగను ఉండుననుట మనందరికి అనుభవమే. నిద్రపోయి మేల్కొనకున్నచో నిద్రకును మృత్యువునకు భేదమేముండును ? మృత్యువు తప్పనిసరియైనను రోగము తప్పనిసరి కాదు. పదునాల్గేండ్ల వనవాసమున శ్రీరాముడు అస్వస్థుడైనట్లుగ రామాయణములో ఎచటను కాన్పించదు. పండ్రెండేండ్ల అరణ్య వాసమున భీముడు వ్యాధిగ్రస్తుడైనట్లు మహాభారతములో ఎక్కడను కనిపించదు. అడవిలోని సింహముగాని మరే పశువుగాని జ్వరమువల్ల దుఃఖమునకు గురియైనట్లు ఎవరైనా విన్నారా ? అడవి జంతువుల కొరకు ఎపుడైనా చికిత్సాలయము లేర్పడి యుండెనా ? లేదు గదా ! అడవి జంతువులు ఆకలి లేనిదే తినవు. అవి ప్రకృతి ననుసరించి వ్యవహరించును. కాని మనమో ! మన విషయమటుంచుడు మన పెంపుడు పశువులు గూడ రోగగ్రస్తమగును. ఏలన అవి మన సంపర్కములో నుండును గదా ! మన జీవనము అప్రాకృతికమైనది. కావున వాటి

జీవనమును గూడ అప్రాకృత మొనర్చినాము. ఈశ్వరుడు మనష్యుని రోగి యగుటకు సృష్టించలేదు. సృష్టిలో వృక్షాదులు, పశువులు మొదట ఉత్పన్నమైనవి. వాని తర్వాత మనష్యుడు ఉత్పన్నమైనాడు. మానువుడు ప్రకృతి ప్రసాదించిన అతిసుందరమైన వరము. తపోవనము లందు మహాత్ములు ఆనందపూర్వకముగ నివసించుచుండిరి. వారు లేడిపిల్లలను మానవశిశువులవలె సాకుచుండిరి. ఈశ్వరుడు మానవుని దప్పిని తీర్చుటకు నీటిని, ఆకలిని తీర్చుటకు ఉత్తమోత్తమమైన ఆహారమును, పీల్చుకొనుటకు ప్రాణప్రదమైన గాలిని, ఇంకా ఇతర పదార్థముల నెన్నిటినో సృష్టించెను. కాని జ్వరమును సృష్టింపలేదు. దానిని మన అప్రాకృతిక వ్యవహారముల ద్వారా మనమే సృష్టించుకొంటిమి.

నేడు స్త్రీలు అధికముగ రోగగ్రస్తులైయున్నట్లు గోచరించును. నేటి యువతులకన్న 70 సంవత్సరముల ముసలివారే ఆరోగ్యవంతులుగ నున్నారు. ఒక స్త్రీ రైలులో ప్రయాణము చేయుచుండెను ఆమె రైలు పెట్టెలో ఒంటరిగా నుండుట చూచి ఒక దోపిడికాడు ఆమె కూర్చున్న పెట్టెలోనికి ప్రవేశించెను. ఆమె వానిని దిగుమని చెప్పినను వినక ఆమె వైపు వచ్చుచుండ ఆమె వాని ముఖముపై బలముగా రెండు దెబ్బలు వేసి ముందరి స్టేషనులో వానిని పోలీసున కప్పగించెను. నిజమేమన తలిదండ్రులు మంచివారైనచో సంతానం గూడ మంచిదే యగును. ఆరోగ్యవంతులైనచో తల్లిదండ్రుల సంతానం ఎప్పుడు రోగగ్రస్తము కాదు. ఎందుచేత ? ఇదంతయు పొరపాటుననే జరుగునందురా ? కాదు. మీరు ఆరోగ్యవంతమైన సంతానము కావలె ననుకొన్నచో మొదట మీరు మానసిక స్వాస్థ్యమును సంపాదించుకొనుడు. మనష్యుడు చింతలు నుండి తనను కాపాడుకొనవలెను. నేటి యువకులెందరో విచారగ్రస్తులై యుండుట వలననే క్షయవ్యాధికి గురియగుచున్నారు. మరి యీ చింతలు ఎందుకు ప్రాప్తించును ? మానవునకు ఈశ్వరునిపై సంపూర్ణ విశ్వాసము లేనపుడే అతనిని చింతలు వెన్నాడును. కావున ఓ సోదరులారా ! నిజమైన ఈశ్వరుని ఉపాసించి ఆత్మగంతులు కండు.

ఓం శమ్

ఆర్యసమాజ దశ నియమాలు

1. సమస్త సత్య విద్యలకును విద్యచే నెఱుఁగబడు పదార్థములకును ఆది మూలము పరమేశ్వరుడు.

2. ఈశ్వరుడు సచ్చిదానంద స్వరూపుడు, నిరాకారుడు, సర్వ శక్తిమంతుడు, న్యాయకారి, దయాళువు, అజన్ముడు, అనంతుడు, నిర్వికారుడు, అనాది, అనుపముడు, సర్వాధారుడు, సర్వేశ్వరుడు, సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి, అజరుడు, అమరుడు అభయుడు, నిత్యుడు, పవిత్రుడు సృష్టికర్తయునై ఉన్నాడు అతనినే ఉపాసించుట తగును.

3 వేదము సమస్త సత్యవిద్యల పుస్తకము. వేదమును చదువుట చదివించుట, వినుట, వినిపించుట ఆర్యులందరి పరమ ధర్మము.

4. సత్యమును గ్రహించుటకును, అసత్యమును త్యజించుటకును, సర్వదా సంసిద్ధులై ఉండవలయును.

5. అన్ని పనులు ధర్మానుసారముగా అనగా సత్యాసత్యములను ఆలోచించి చేయవలెను.

6. ప్రపంచమునకు ఉపకార మొనర్చుట ఈ సమాజముయొక్క ముఖ్యోద్దేశ్యము. అనగా శారీరిక, ఆత్మిక మరియు సామాజిక ఉన్నతిని బడయుట.

7. అందరితో ప్రేమపూర్వకంగా, ధర్మానుసారముగా, యథాయోగ్యముగా వ్యవహరించవలయును.

8. అవిద్యను నశింపజేసి, విద్యను పెంపొందింప వలయును.

9. ప్రతి యొక్కరు తమ ఉన్నతి యందే సంతుష్టులు గాక, అందరి ఉన్నతిలో తమ ఉన్నతి నెంచవలయును.

10. మనుష్యులందరు సామాజిక–సర్వహితకరములగు నియమములను పాలించుటలో పరతంత్రులుగా నుండవలయును. మరియు వ్యక్తి హితకరములగు నియమములందు అందరు స్వతంత్రులుగా నుండ తగును.

వెల : 40 పైసలు.